# ఈనాడు ఆదిలాబాద్

శుక్రవారం అక్టోబరు 18, 2024






అడ్డదిడ్డంగా వెళుతున్న ప్రైవేటు వాహనాలు



ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108 వాహనం

## ప్రైవేటు ఇష్టారాజ్యం.. ట్రాఫిక్‌కు ఆటంకం

ఓ వైపు ఇచ్చోడలో రోడ్డు పనులు సాగుతుండగా, ప్రైవేటు వాహనాల ఇష్టారాజ్యంతో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమయ్యాయి. ఆటోలతో పాటు ఇతర వాహనాలను రోడ్డుపై నిలిపి ఉంచడంతో ఒక పక్క పనులు, మరోవైపు రాకపోకలు సాగించే వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. అత్యవసర వాహనాలది అదే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు వాహనాలు రోడ్డుపై నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి. ఇచ్చోడ, న్యూస్‌టుడే


## రూ. 4 కోట్ల ఎస్‌డీఎఫ్‌తో 115 పనులు

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే :** ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రత్యేక అభివృద్ధి నిధి (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్)కి సంబంధించి పనులకు ఆమోదం లభించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఆదిలాబాద్ నియోజకవర్గానికి మంజూరైన రూ.10 కోట్లలో ఇది వరకే కొంత ఖర్చుచేయగా రూ.5.50 కోట్ల వరకు మిగిలాయి. రెండు నెలలుగా మిగిలిన నిధులతో చేపట్టే పనుల ప్రతిపాదన ఆమోదం కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ఇందులో రూ.4 కోట్లకు సంబంధించి 115 పనులకు ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. ఆమోదం లభించడంతో ముఖ్యప్రణాళిక అధికారి కార్యాలయం నుంచి వర్క్ ఆర్డర్ ఉత్తర్వులు జారీ కానున్నాయి. ఈ పనులన్నీ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదించినవే. మంజూరైన పనుల్లో సామాజిక భవనాలు, సీసీరోడ్లు, ప్రహరీలు, షెడ్ల నిర్మాణం ఇతర పనులున్నాయి. కంది శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు.

# అడవి బిడ్డ నినాదం.. అభివృద్ధి విధానం




ప్రజా దర్బార్‌లో ప్రసంగిస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు, వెడ్మబొజ్జు, మాజీ మంత్రి వేణుగోపాల చారి, భీం మనవడు సోనేరావు, కలెక్టర్, ఐటీడీఏ పీవో, తదితరులు



**ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఆసిఫాబాద్:** జల్.. జంగల్.. జమీన్ నినాదమే లక్ష్యంగా పోరు సాగించిన కుమురంభీం వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. రాజకీయాలకతీతంగా మంత్రి సీతక్క సహా కాంగ్రెస్, భాజపా, భారాస ప్రజాప్రతినిధులు దర్బార్‌లో కలిసి పాల్గొనటం కొత్త ఒరవడికి కేంద్ర బిందువుగా నిలిచింది. మంత్రి సీతక్క, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ దండె విఠల్ సహా వివిధ సంఘాల బాధ్యులు ప్రసంగించారు. ఆదివాసీల జీవన విధానం, అభ్యున్నతి, పోడుభూమి సమస్య పరిష్కార కోసం కృతనిశ్చయంతో పనిచేయాలని, ఏజెన్సీలో రహదారులు, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం సహా మౌలిక వసతులు కల్పించాలని, భీం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సమాలోచనలతో దర్బార్ సాగింది. ఆదివాసీల సంప్రదాయ రీతిలో కుమురంభీం సహా కుమురం



మొక్కుతున్న కుమురంభీం మనవడు సోనేరావు కుటుంబ సభ్యులు



హాజరైన జనం

### జోడేఘాట్‌లో కుమురంభీంకు ఘన నివాళి

సూరు విగ్రహాలకు నివాళులర్పించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా భీం జీవిత చరిత్రను వెల్లడించేలా సీడీని విడుదల చేసి గోండి భాషలో ప్రసంగించడం ఆదివాసీల్లో ఉత్తేజాన్ని నింపింది. గతేడాదితో పోల్చితే ఈ దఫా జనప్రవాహం కాస్త తగ్గింది.

◆ **ఎంపీ నగేష్ మాట్లాడుతూ..** నాలుగేళ్ల నుంచి ఐటీడీఏ గవర్నింగ్ బాడీ సమావేశం జరగడం లేదని వెంటనే నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ.. పుస్తకాల్లో భీం చరిత్ర చదివానని, ఇక్కడ పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. భీం మనవడు సోనేరావు మాట్లాడుతూ.. భీం పోరాటంతోనే గుర్తింపు వచ్చిందన్నారు. కానీ ఆదివాసీలకు మాయ మాటలు చెప్పి తప్పుడు పట్టాలు ఇవ్వకుండా చూడాలన్నారు.



ఆదివాసీల గుస్సాడీ నృత్యం

◆ **ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ..** గిరి వికాసం కింద ఆదివాసీ భూముల్లో బోర్లు వేయించాలని, కుమురంభీం కట్ట, వట్టివాగు ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయించాలన్నారు. జైనూర్ ఘటన బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం, కుటుంబంలో ఉద్యోగం కల్పించాలని, అక్కడ 144 సెక్షన్ ఎత్తివేయాలన్నారు.

◆ **ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ..** బీడు, అటవీ భూముల్లో జీడీ మొక్కల పెంపకంతో ఉపాధి లభిస్తుందన్నారు. దసలిపట్టు సాగు రైతులను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని, దీన్ని నివారించాలన్నారు.

◆ **ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ** జోడేఘాట్‌కు మధ్యలో అటవీ అనుమతి లేక నిలిచిన 6 కి.మీ. రోడ్డును వచ్చే వర్ధంతి వరకు పూర్తి చేసేలా చూస్తాం

◆ **ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ** 12 పోరు గ్రామాల్లోని 350 మంది ఆదివాసీలకు రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఐటీడీఏల్లో 28 శాఖలు పనిచేయాల్సి ఉండగా కొన్ని మాత్రమే చేస్తున్నాయన్నారు. వీటిని బలోపేతం చేయాలన్నారు.

### భీం పోరాటంతోనే గిరిజన చట్టాలు : మంత్రి సీతక్క

ఆదివాసీల హక్కుల కోసం చేపట్టిన కుమురం భీం పోరాట ఫలితమే గిరిజన చట్టాల రూపకల్పనకు దారి తీసిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీలకు అండగా నిలిచే స్వయం ప్రతిపత్తి కలిగిన ఐటీడీఏలు కొన్ని నిర్వీర్యమైన విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్లామని, వాటికి నిధులు కేటాయించి జవసత్వాలు తెస్తామన్నారు. కొన్నిచోట్ల అటవీశాఖ అధికారులు ఆదివాసీలపై దౌర్జన్యం చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. భీం నెత్తురోడిన ఈ ప్రాంతంలో భూమి ఆక్రమణలు కాకుండా చూడాలని, 12 పోరు గ్రామాల ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్ల కోసం నివేదికలు తయారు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఇక్కడ పర్యాటక ప్రాంత అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు చేస్తామన్నారు. యువతకు ఉపాధి కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణలు ఇప్పిస్తామన్నారు.



వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే శంకర్, అదనపు పాలనాధికారి శ్యామలదేవి

## వాల్మీకి మహర్షి జయంతి

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే :** రామాయణం రచించిన వాల్మీకి మహర్షి జయంతిని కలెక్టరేట్‌లో గురువారం అధికారికంగా నిర్వహించారు. వేడుకల్లో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల్ శంకర్, అదనపు పాలనాధికారి శ్యామలదేవి, బీసీ సంక్షేమాధికారి రాజలింగు, బీసీ సంఘ నేతలు పాల్గొన్నారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మానవుడు ఎలాంటి సత్ప్రవర్తనను కలిగి ఉండాలో రామాయణం బోధిస్తుందని వక్తలు పేర్కొన్నారు.

## జువైనల్ కోర్టు న్యాయమూర్తిగా బి.హుస్సేన్

**ఎదులాపురం, న్యూస్‌టుడే :** రాష్ట్రంలో మొత్తం 17 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో బోథ్‌లో జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న బి.హుస్సేన్‌ను ఆదిలాబాద్ జువైనల్ కోర్టు సివిల్ జడ్జిగా బదిలీ చేసింది. ఖాళీ అయిన బోథ్ సివిల్ జడ్జి పూర్తి అదనపు బాధ్యతలను ఉట్నూర్ న్యాయమూర్తికి అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## చెకిముకి సైన్సు ప్రతిభా పోటీలు

**పాలనాప్రాంగణం:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకిముకి సైన్సు ప్రతిభా పోటీలు నవంబరు 7 నుంచి నిర్వహించనున్నారు. గురువారం పాలనాధికారి రాజర్షిషా ప్రచార గోడప్రతులను విడుదల చేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేలా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయులు 8, 9, 10 తరగతుల విద్యార్థులు అత్యధికంగా ఈ పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజేశ్వర్, జిల్లా గౌరవ అధ్యక్షులు రాంరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకాంత్, ఊశన్న, కోశాధికారి లింగారెడ్డి, సభ్యులు నాగరాజు, రాజు, రవీందర్, రామచంద్రయ్య, లక్ష్మారెడ్డి, బీఎన్‌రెడ్డి పాల్గొన్నారు.


# తెల్లబంగారం మెరిసేనా.. మద్దతు దక్కేనా?



● **కొనుగోళ్లపై నేడు సమావేశం**

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

**బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర పూర్తిగా పడిపోయింది. సీసీఐ కొనుగోలు చేస్తేనే రైతులకు కనీస మద్దతు ధర దక్కే అవకాశం ఉంది. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలు, ఎప్పుడు ప్రారంభించాలి, కొనుగోలు నిబంధనలు, తేమ శాతంపై చర్చించేందుకు నేడు ఆదిలాబాద్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. పత్తి క్రయవిక్రయాల్లో గతేడాది ఏర్పడిన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.**




జిల్లాల వారీగా పత్తి సాగు(లక్షల ఎకరాల్లో), దిగుబడి అంచనా (లక్షల క్వింటాళ్లలో)

**తేమతోనే పేచీ..** పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 మధ్యన ఉండాలి. 8 శాతం తేమ ఉంటే క్వింటాలుకు మద్దతు ధర రూ.7,521 ధర వస్తుంది. అంత కంటే తక్కువగా ఉంటే.. తగ్గిన ప్రతి శాతానికి కిలో ధర తగ్గించి కొనుగోలు చేస్తారు. 12 శాతం తేమ కంటే ఎక్కువ ఉంటే సీసీఐ పత్తిని కొనుగోలు చేయదు. మార్కెట్లో పత్తి ధర క్వింటాలుకు రూ.6,900 ఉంది. తేమ ఎక్కువగా ఉంటే మరింత తగ్గించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండటంతో పత్తి కొనుగోలుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు.

పంట ఇంటికి చేరుతుండటంతో కొంత మంది రైతులు పత్తి విక్రయానికి సిద్ధంగా ఉన్నారు. ఏటా దసరా తర్వాత మార్కెట్ ప్రారంభమయ్యేది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. మార్కెట్లో ధర తగ్గిపోవడంతో రైతులు సీసీఐ కొనుగోళ్లపై ఆశలు పెట్టుకున్నారు. అధికారుల అంచనా మేరకు 73.98 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది.

### ఆధార్ తప్పనిసరి



పట్టాపాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబరు.. మూడు ఒకే ఆధార్‌తో అనుసంధానమై ఉంటే విక్రయాల్లో చిక్కులు ఉండవు. గత సీజన్‌లో చాలా మంది రైతుల ఆధార్ ఉపాధి హామీ బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉండటంతో పత్తి విక్రయించిన డబ్బులు నేరుగా ఉపాధి ఖాతాలో జమయ్యేవి. కొందరు రైతుల డబ్బులు పోస్టాఫీసులో జమకావడం, వాటిని ఇతర బ్యాంకు ఖాతాలకు బదిలీ చేస్తామని చెప్పి సంబంధిత అధికారి రూ.కోట్లు కాజేయడంతో రైతులు తిరిగి డబ్బులు పొందేందుకు ముప్పుతిప్పలు పడ్డారు.

◆ పత్తి పంట పండించిన రైతు నేరుగా పత్తిని విక్రయించేందుకు మార్కెట్‌కు వస్తే.. అతడి ఆధార్‌కార్డు నెంబరుతో బయోమెట్రిక్ యంత్రంలో వేలిముద్ర తీసుకొని పంటను కొనుగోలు చేస్తారు. వేలిముద్ర సరిపోకపోతే ఐరిస్‌తో పోల్చుకుంటారు. రైతు రాలేని పక్షంలో రైతు ఆధార్‌కార్డుతో పాటు అనుసంధానమై ఉన్న ఫోన్ తీసుకొని కుటుంబీకుల్లో ఎవరైనా రావాలి. అదే ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. అలా వచ్చిన ఓటీపీని నమోదు చేసి, సంబంధిత రైతు నుంచి పత్తిని కొనుగోలు చేస్తారు. రైతులు క్రయవిక్రయాల సమాచారం తెలుసుకునేందుకు మార్కెట్ శాఖ ప్రవేశపెట్టిన వాట్సాప్ నెంబరులో వచ్చే సమాచారం తప్పుల తడకగా ఉందని రైతులు అంటున్నారు. దీన్ని సరిచేయాల్సిన అవసరం ఉంది.

## ప్రమాదాన్ని తెర ఆపేనా?

**బోథ్** మండలం ధన్నూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో గ్రామ సమీపంలో రహదారి కోతకు గురైంది. సంబంధిత అధికారులు కోతకు గురైన స్థలంలో మొరం వేసి పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు తిరిగి మళ్లీ ఆ ప్రాంతంలోనే రహదారి కోతకు గురైంది. ప్రమాదాలు జరగకుండా యువకులు గ్రామంలో ఏర్పాటు చేసిన బ్యానర్లను కోతకు గురైన స్థలంలో ఏర్పాటు చేశారు. **- న్యూస్‌టుడే, బోథ్**



## విద్యుత్తు శాఖలో బదిలీలు

**ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే :** విద్యుత్తు శాఖలో డీఈ స్థాయి నుంచి లైన్‌మెన్ వరకు బదిలీలు జరిగాయి. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిలో 50 శాతం మంది బదిలీలకు అర్హతగా తీసుకొని స్థానచలనం కల్పించారు. జిల్లాలో 19 మంది లైన్‌మెన్‌లకు, 12 మంది లైన్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. ముగ్గురు ఏఈలు మాత్రమే ఇతర జిల్లాలకు బదిలీ కాగా, మిగిలిన అధికారులను జిల్లాలోనే ఇతర మండలాలకు కేటాయించారు. బోరజ్ ఏఈగా పని చేసిన గంగాధర్ కామారెడ్డికి, జైనథ్‌లో పని చేసిన నగేష్ జగిత్యాలకు, శంకర్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లాలో పని చేస్తున్న జేఏలు 8 మంది, సబ్ ఇంజినీర్లు 12 మంది, సీనియర్ అసిస్టెంట్లు 9 మంది, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లకు బదిలీలు జరిగాయి. వీరితో పాటు మరో ఇద్దరు ఏఏవోలకు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు బదిలీ అయింది.

మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఈల బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి.

| ఏఈ పేరు | బదిలీ |
|---|---|
| సతీష్‌కుమార్ | ఆదిలాబాద్ రూరల్ |
| శ్రీనివాస్ | తలమడుగు |
| తిరుపతిరెడ్డి | భీంపూర్ |
| గౌతమ్ | ఎంఆర్‌టీ, ఆదిలాబాద్ |
| శ్రావణ్ | ఎంఆర్‌టీ, ఆదిలాబాద్ |
| కిరణ్ | ఆదిలాబాద్ టౌన్ |
| సునిల్‌కుమార్ | సర్కిల్ కార్యాలయం, ఆదిలాబాద్ |

# సాంకేతిక సమస్య.. లబ్ధిదారుల నిరాశ

● **ఆందోళనలో పీఎం విశ్వకర్మ దరఖాస్తుదారులు**

**వేగంగా పురోగమిస్తున్న ప్రపంచీకరణతో సంప్రదాయ వృత్తుల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆయా రంగాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాల వినియోగం పెరుగుతోంది. వాటిని అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యాలు, ఆర్థిక దన్ను కీలకం. ఈ నేపథ్యంలో ఆయా వర్గాలకు ఊతమిచ్చి వారి ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. 2023 సెప్టెంబరు 17న పథకం అమల్లోకి వచ్చింది. జిల్లాలో సాంకేతిక సమస్యతో 4,816 మంది కుల, చేతివృత్తిదారులు పథకానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది.**



ఉట్నూరులో వడ్రంగుల శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే బొజ్జు



పీఎం విశ్వకర్మ పథకం శిక్షణలో కులవృత్తిదారులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం, బేల

జిల్లాలో మొత్తం 8,810 మంది కుల, చేతివృత్తిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పథకంలో మూడు దశలుగా.. పంచాయతీ కార్యదర్శి, జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులు పంచాయతీ లేదా పురపాలక శాఖ లాగిన్‌కి వెళ్తాయి. వారు పరిశీలించి అర్హుల దరఖాస్తులను కలెక్టర్ పరిశీలన కోసం పంపిస్తారు. జిల్లాలోని పలు మండలాల పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌లో సాంకేతిక సమస్య ఎదురవుతోంది. ఫలితంగా అక్కడే పెండింగ్‌లో ఉంటున్నాయి. లబ్ధిదారులు నెలల తరబడి ఎదురుచూస్తూనే ఉన్నారు. పంచాయతీ కార్యదర్శుల, ఎంపీడీవో కార్యాలయ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పురపాలక, పంచాయతీల్లో దరఖాస్తుల విచారణలో జాప్యం కూడా ఒక కారణంగా నిలుస్తోంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. సాంకేతిక సమస్య లేని పంచాయతీలోని లబ్ధిదారులు పథకానికి ఎంపికై శిక్షణ సైతం పూర్తి చేసుకుంటున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

- మొత్తం దరఖాస్తులు: 8,810
- పెండింగ్‌లో : 4816
- కలెక్టర్ స్థాయిలో ఆమోదం పొందినవి: 2,851
- రాష్ట్రస్థాయిలో ఆమోదం : 918
- తిరస్కరణ : 2



**బేల** మండలం సాంగిడికి చెందిన డోకే అనిల్ పీఎం విశ్వకర్మ యోజన పథకానికి మార్చి 8న సీఎస్‌సీ కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అర్హుల ఎంపిక బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శి చేయాల్సి ఉంది. సాంకేతిక కారణాలతో దరఖాస్తులు ఆమోదం కావడం లేదు.

### పట్టించుకోవడం లేదు



ఈమె పేరు కొత్తూరి దీప. ఆదిలాబాద్ గ్రామీణ మండలం జందాపూర్. మూడు నెలల కిందట పీఎం విశ్వకర్మ పథకంలో దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ లాగిన్‌లో సాంకేతిక సమస్యతో దరఖాస్తు పంచాయతీ పరిధిలో పెండింగ్‌లో ఉంది. పంచాయతీ కార్యదర్శిని ఎన్నిసార్లు సంప్రదించినా సాంకేతిక సమస్య ఉందని చెబుతున్నట్లు ఆమె తెలిపారు.



## రూ.లక్ష సాయం అందజేత

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే :** నార్నూర్ మండలం మరపగూడకు చెందిన పూసం అశోక్‌కు సంగారెడ్డిలో ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు రాగా.. ఆ నిరుపేద విద్యార్థికి ఉపాధ్యాయుడు మెస్రం శేఖర్‌బాబు అడ్మిన్‌గా ఉన్న అభిమన్యు వాట్సాప్ గ్రూపు సభ్యులు అండగా నిలిచారు. రూ.లక్ష నగదును విరాళాల రూపంలో సేకరించి పాలనాధికారి రాజర్షిషా చేతుల మీదుగా గురువారం అందించారు. శేఖర్‌బాబు చొరవను పాలనాధికారి అభినందించారు. పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణకుమార్, స్వామి, రాజు, రవీందర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులంతా ఏకమై.. రహదారి బాగు చేసి!

**తలమడుగు** మండలం ఉమ్రికి చెందిన రైతులు ఏకమై గుట్టపై సాగు చేస్తున్న పంట పొలానికి వెళ్లే రహదారిని గురువారం బాగు చేసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతింది. పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుట్ట ఎక్కలేని పరిస్థితి. ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. అన్నదాతలంతా పలుగు, పార పట్టి రహదారికి అడ్డంగా ఉన్న పెద్ద రాళ్లను తొలగించి బాగు చేసుకున్నారు. గుట్ట పైభాగంలో దాదాపు 600 ఎకరాల పంటను రైతులు సాగు చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తలమడుగు**

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

**న్యూస్‌టుడే, బజార్‌హత్నూర్**

? బజార్‌హత్నూర్ కస్తూర్బా పాఠశాల ప్రహరీ బయట, దుకాణాలను ఆనుకొని ఉన్న నీలగిరి చెట్లు భారీ గాలులకు విరిగిపడే ప్రమాదం ఉంది. సమస్యను పరిష్కరించాలి. **- శ్యాంసింగ్, బజార్‌హత్నూర్**

✔ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం.

**- సునీల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బజార్‌హత్నూర్**

**న్యూస్‌టుడే, గుడిహత్నూర్**

? గుడిహత్నూర్ మండలం గురుజ్ పంచాయతీ నుంచి మన్నూర్‌కు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో వాహన చోదకులు గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. **- సుధాకర్, గురుజ్**

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం.

**- అబ్దుల్‌హై, ఎంపీడీఓ గుడిహత్నూర్**

**న్యూస్‌టుడే, తాంసి**

? తాంసి నుంచి వామన్‌నగర్, గిరిగామ్, లీమ్‌గూడ, అట్నాంగూడ, అంబుగామ్ గ్రామాలకు వెళ్లే మార్గంలో పలు చోట్ల ములమలుపుల వద్ద ముళ్ల పొదలు దట్టంగా పెరిగాయి. **- యశ్వంత్, అంబుగామ్**

✔ పొదలు తొలగిస్తాం. **- మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, తాంసి**

**న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్**

? ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ శివాలయం సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతోంది.

**- వంశీకృష్ణ, స్థానికుడు**

✔ పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి తాగునీటి లీకేజీని అరికడతాం.

**- అరుణ్, డీఈఈ**



## పూడిక తొలగించారు

వందనం

**ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే :** ఆదిలాబాద్ గ్రామీణ మండలం జందాపూర్ శ్మశాన వాటిక వద్ద కచ్చా డ్రైనేజీ చెత్తతో నిండి రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. బుధవారం 'ఈనాడు'లో మేమున్నాం.. మీకు తోడుగాలో సమస్య ప్రచురితమైంది. ఎంపీవో సత్యానంద్ స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సల్మా సిబ్బందితో డ్రైనేజీలో పూడిక తొలగించి మురుగు రహదారిపైకి రాకుండా సమస్యను పరిష్కరించారు.

## 'ఈనాడు' చొరవ.. తీరిన బోధకుల కొరత



భీంపూర్ పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులతో ఎంఈవో శ్యాంసుందర్, హెచ్‌ఎం కుసుమ, ఇతరులు

**భీంపూర్, న్యూస్‌టుడే :** మండలంలోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై 'ఈనాడు'లో వచ్చిన కథనాలు ఫలించాయి. భీంపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 147 మంది ఉన్నా కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా.. అందులో కీలకమైన 'గణితం, ఆంగ్లం బోధకులు కరవు' శీర్షికన జులై 25న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన పాలనాధికారి రాజర్షిషా అదే రోజు మండల పర్యటనకు వచ్చినప్పుడు పాఠశాలను సందర్శించారు. తాత్కాలికంగా అప్పట్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. తాజాగా డీఎస్సీలో ఆంగ్లం, గణితంతో పాటు ఖాళీగా ఉన్న సాంఘికశాస్త్రం పోస్టులను భర్తీ చేశారు. బుధవారం ముగ్గురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఉపాధ్యాయులు లేని అంతర్గాం పాఠశాలకు ఇద్దరిని, రాజుల్‌వాడి, భగవాన్‌పూర్, మందపల్లికి ఒక్కొక్కరిని కేటాయించారు. కరంజి-టి ప్రాథమిక పాఠశాలలో నలుగురిని, గుబిడి, అర్లి-టి, గోముత్రి పాఠశాలలకు ఒక్కొక్కరిని మండలానికి మొత్తం 12 మంది ఉపాధ్యాయులను కేటాయించడంతో బోధకుల కొరత తీరినట్లయ్యింది.

## వ్యవసాయ పరిశోధన స్థానం తాత్కాలిక ఉద్యోగి మృతి



భీంరావు

**ముథోల్, న్యూస్‌టుడే:** ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానంలో పని చేసే తాత్కాలిక ఉద్యోగి భీంరావు(25) గురువారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సైద్‌పూర్ గ్రామానికి చెందిన భీంరావు ముథోల్‌లో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. వ్యవసాయ పరిశోధన స్థానంలో ఎనిమిది నెలల నుంచి తాత్కాలిక ఉద్యోగి(రీసెర్చ్ ఫెల్లో)గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం అద్దె భవనంపై మృతి చెంది కనిపించాడు. భవనంలో అద్దెకు ఉండే ఇతర వ్యక్తులు గమనించి వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులకు, శాస్త్రవేత్తలకు సమాచారం అందించారు. ఎస్సై సాయికిరణ్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతికిగల కారణాలు తెలుసుకుంటున్నామని, అతడి కుటుంబీకులు వచ్చిన తర్వాత వివరాలు తెలుస్తాయన్నారు. దసరాకు ఇంటికి వెళ్లిన తర్వాత బుధవారం విధులకు హాజరై గురువారం రాలేదని, ఆయన చరవాణికి తోటి ఉద్యోగులు ఫోన్ చేసినా సమాధానం రాలేదన్నారు. సాయంత్రం ఒక్కసారిగా మృతి చెందాడన్న వార్త తెలుసుకున్న శాస్త్రవేత్తలు, మిగతా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.



సద్గురు అడాణేశ్వర చిత్రపటంతో పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

## సద్గురు అడాణేశ్వర్ భక్తుల శోభాయాత్ర

**ఆదలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే :** పౌర్ణమిని పురస్కరించుకుని సద్గురు అడాణేశ్వర్ భక్తులు మహారాష్ట్రలోని ఆయా ప్రాంతాల నుంచి ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. పట్టణంలో సద్గురు అడాణేశ్వర్ చిత్రపటంతో పల్లకిసేవ నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపిస్తూ స్థానిక టీచర్స్ కాలనీలోని శ్రీనిలోమ సేవా ఆశ్రమానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## విజేత ఆదిలాబాద్ బ్ల్యూ జట్టు




ఆదిలాబాద్ జట్టుకు కప్ అందిస్తున్న ప్రముఖులు

**ఆదిలాబాద్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే :** ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న హెచ్‌సీఏ అండర్-23 క్రికెట్ లీగ్ పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. ఇందులో మూడు జట్లు పాల్గొన్నాయి. తుది పోరులో నిర్మల్ జట్టుపైన ఆదిలాబాద్ బ్ల్యూ జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. 19న మంచిర్యాలలో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకుడు యూనుస్ అక్బాని, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అతవుల్లాఖాన్ విజేత జట్లకు బహుమతులు అందజేశారు.



భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాలనాధికారి రాజర్షిషా



ఉట్నూరు : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



కలెక్టరేట్ చౌరస్తాలో ఎమ్మెల్యే పాయల్ శంకర్

## పోరాట వీరుడికి నివాళులు

**ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్, పాలనాప్రాంగణం, ఎదులాపురం, సాంస్కృతికం, ఆదిలాబాద్ గ్రామీణం, ఉట్నూరు గ్రామీణం, ఇచ్చోడ, బోథ్(సొనాల), తలమడుగు, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, నార్నూర్, న్యూస్‌టుడే :** జల్, జంగల్, జమీన్ కోసం నిజాం సర్కారుపై పోరాడిన ఆదివాసీ వీరుడు కుమురం భీం వర్ధంతిని గురువారం వివిధ రాజకీయ పార్టీలు, ఆదివాసీ, కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. భీం విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశత్వాన్ని ఎదురించి ఆదివాసీల దేవుడిగా నిలిచాడని కొనియాడారు. ఆయన బాటలో హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు.



ఆదిలాబాద్ : మాజీ మంత్రి జోగురామన్న



ఆదిలాబాద్ : కాంగ్రెస్ నాయకులు



సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకులు



ఇచ్చోడలో.. ఆదివాసీలు



సొనాలలో నినాదాలు చేస్తూ..



తుడుందెబ్బ నాయకులు



ఉట్నూరు: రితేష్ రాథోడ్



తలమడుగులో



ఇంద్రవెల్లిలో..



ఆదిలాబాద్ గ్రామీణ : ఎంపీడీవో కార్యాలయంలో



గుడిహత్నూర్‌లో

## కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదు



గోడప్రతులను విడుదల చేస్తున్న మాజీ మంత్రి రామన్న

**జైనథ్, న్యూస్‌టుడే :** బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, రైతులకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్ర స్థాయిలో తెలియజెప్పేందుకు మాజీ మంత్రి కేటీఆర్ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జైనథ్ మండలం నిరాలలో గురువారం భారాస పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీల గోడప్రతులను నేతలతో కలిసి విడుదల చేశారు. మాజీ ఎంపీపీలు రమేష్, గోవర్ధన్, మాజీ వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు లింగారెడ్డి, గణేష్‌యాదవ్, ఊశన్న, ప్రహ్లాద్, నారాయణ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ గ్రామీణం:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. గురువారం మండలంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన భారాస కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాయకులు రమేష్, రమణ, ప్రహ్లాద్, గంగయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### పత్తికి తెలంగాణలో తక్కువ ధర ఎందుకు?

**ఆదిలాబాద్ పట్టణం:** గుజరాత్‌లో పత్తికి ఎక్కువ ధర చెల్లిస్తూ.. తెలంగాణలో మాత్రం తక్కువ ధర ఎందుకు ఇస్తున్నారని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనమని విమర్శించారు. ఆదిలాబాద్‌లోని భారాస జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ కేవలం గుజరాత్‌కే ప్రధానమంత్రి కాదని గుర్తించాలన్నారు. పట్టణ అధ్యక్షుడు అజయ్, నారాయణ, ప్రహ్లాద్, యూనుస్ అక్బానీ, రాజు, పరమేశ్వర్, రమేష్, జగదీష్, సతీష్ పాల్గొన్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

## రెండు లక్షల రుణమాఫీ ఏమైంది? : ఎమ్మెల్యే

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:** రూ.2 లక్షల రుణమాఫీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, రైతుల ఖాతాల్లో ఆ డబ్బును ఎప్పుడు జమచేస్తారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. జైనథ్ మండలం బెల్లూరికి చెందిన మాజీ ఉపసర్పంచి దుర్వ చంపత్‌రావుతో కలిసి గ్రామస్థులు భాజపాలో చేరగా.. గురువారం క్యాంపు కార్యాలయంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**జైనథ్, న్యూస్‌టుడే :** జైనథ్ మండలం పిప్పర్‌వాడ గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను మరాఠీ శివపుత్ర సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. పెద్దలు, మహిళలు, యువకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**సొనాల(బోథ్):** బోథ్ మండలం సొనాల రామాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయుడు మధుసూదన్, గ్రామస్థులు పాల్గొన్నారు.



సొనాల రామాలయంలో చిత్రపటం వద్ద గ్రామస్థులు



వేడుకల్లో మరాఠీ శివపుత్ర సంఘ కులస్థులు



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

## అంగన్‌వాడీల ధర్నా

**ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే :** మినీ అంగన్‌వాడీ టీచర్లకు ప్రధాన అంగన్‌వాడీ టీచర్లతో సమానంగా ఇచ్చిన వేతనాలు యథావిధిగా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 5 నెలల బకాయిలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న అన్నారు. గురువారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. యూనియన్ నాయకులు రత్నమాల, ముక్త మాట్లాడారు. ముప్పిడి పద్మ, పార్వతి, సురేఖ, లక్ష్మి, అనసూయ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధుడి మార్గాన్ని అనుసరించాలి



ర్యాలీగా వస్తున్న దళితులు, బౌద్ధులు

**ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే :** ప్రపంచానికి శాంతి, కరుణ, మైత్రి సందేశాన్ని ఇచ్చిన గౌతమ బుద్ధుడి మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని పూజ్య భంతే జీవక్ అన్నారు. గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మిలింద్‌నగర్‌లో వర్షవాస్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. దళితులు మిలింద్ నగర్ నుంచి అంబేడ్కర్ కూడలి వద్దకు ర్యాలీగా వచ్చారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం ఊరేగింపుగా మిలింద్‌నగర్‌కు వెళ్లారు. అన్నదానం చేశారు.

## పశువులకు గాలికుంటు టీకాలు

**ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే :** పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బి.కిషన్ తెలిపారు. పశువుల్లో ఎక్కువగా ఆవులు, ఎద్దులకు వ్యాధి సోకే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లా మొత్తంలో 37 పశువైద్యశాలల పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని, జిల్లాలోని 3.11 లక్షల పశువులకు టీకా వేయాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్లు ఆయన చెప్పారు. అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయని, నవంబరు 14 వరకు కార్యక్రమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి

**భీంపూర్, న్యూస్‌టుడే :** డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి తన సొంతూరు వడూర్‌లో తల్లిదండ్రులు కిష్టారెడ్డి-గంగుబాయి జ్ఞాపకార్థం పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను గురువారం గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. రూ.5 లక్షలు వెచ్చించనున్నట్లు ప్రకటించారు. గ్రామపెద్దలు హనుమదాస్‌యాదవ్, భోజన్నయాదవ్, సంజీవ్‌రెడ్డి, దేవారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మంగమఠంలో షెడ్డు..



చంద్రశేఖర్-సౌజన్య దంపతులను సన్మానిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు

**ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే :** జిల్లా కేంద్రంలోని మంగమఠం రమా సత్యనారాయణ దేవాలయంలో షెడ్డు లేక భక్తులు వేసవి, వర్షాకాలాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని కోటోజు చంద్రశేఖర్-సౌజన్య దంపతులు ఆలయ ప్రధాన అర్చకులు వైభవ్‌దుబే శర్మ ద్వారా తెలుసుకున్నారు. స్పందించి రూ.2.5లక్షలు ఖర్చు చేసి దేవాలయం ప్రాంగణంలో తండ్రి కోటోజు వెంకటాచారి జ్ఞాపకార్థంగా షెడ్డును నిర్మించారు. దంపతులను ఆలయ అర్చకులు సన్మానించారు. శ్రీవారి సేవకులు ఆర్.లచ్చయ్య-పద్మ, బి.గోవింద్‌రావు-లక్ష్మి, సాగర్, ఉత్తర్‌వార్ గణేశ్, పిట్ల లచ్చన్న తదితరులు ఉన్నారు.

## మంచి వైద్యులుగా పేరు గడించాలి



విద్యార్థులతో రిమ్స్ సంచాలకుడు జైసింగ్

**ఆదిలాబాద్ వైద్య విభాగం:** రిమ్స్‌కు మంచి వైద్య కళాశాలగా పేరుందని, కొత్తగా ఎంబీబీఎస్‌లో చేరిన విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి వైద్యులుగా పేరు గడించాలని రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్ సూచించారు. రిమ్స్‌లో ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆడిటోరియంలో ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిమ్స్‌లో బోధన తీరు ఎలా ఉంటుంది? సబ్జెక్టులు, తదితర అంశాలను ప్రిన్సిపల్ వంజరి, వైస్ ప్రిన్సిపాళ్లు విద్యా విల్సన్, సరోజ వివరించారు.

### ■ నేటి నుంచి మూడో విడత తనిఖీలు

**నార్నూర్ (గాదిగూడ):** మండలంలోని 25 గ్రామ పంచాయతీలతోపాటు మండల కేంద్రంలో నిర్వహించే ఉపాధి సామాజిక తనిఖీలకు సిబ్బంది, కూలీలు సహకరించాలని ఎస్సార్పీ తిరుపతి అన్నారు. మూడో విడతలో భాగంగా శుక్రవారం నుంచి సిబ్బంది మండలంలోని గ్రామాల్లో పర్యటించి పనులపై తనిఖీలు ప్రారంభిస్తామన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో నితిన్ పవార్, తదితరులు పాల్గొన్నారు.

### ■ పార్టీ బలోపేతానికి కృషి

**ఉట్నూరు గ్రామీణం:** భారాస బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మాట్లాడారు. సతీష్, వాసు, బాబాశ్యామ్, గిరినాయక్, క్రాంతి కుమార్ తదితరులు ఉన్నారు.

### ■ రూ.20 వేల ఆర్థికసాయం

**పాలనాప్రాంగణం:** వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన క్యాన్సర్ బాధితురాలు రాఠోడ్ మీరా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు. ఆమె ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటరామరాజు, భూపతిరెడ్డి, నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. టీయూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బేరదేవన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్‌రెడ్డి, సంజయ్, కరుణాకర్ పాల్గొన్నారు.

### ■ రేషన్‌దుకాణం, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

**సొనాల(బోథ్):** సొనాలలోని అంగన్‌వాడీ కేంద్రం-3, రేషన్ దుకాణం-18లను గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ డీలర్ రుక్మిణి, అంగన్‌వాడీ కార్యకర్త సులోచన తదితరులు పాల్గొన్నారు.

### ■ డీఎస్పీకి సన్మానం

**ఆదిలాబాద్ నేర విభాగం:** ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డిని అంబేడ్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి నాయకులు సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. డీఎస్పీకి కేంద్రం ఇటీవల అతి ఉత్కృష్ట సేవా పతకం ప్రకటించిన నేపథ్యంలో ఆయనను సత్కరించి అభినందించారు. నాయకులు శోభతాయి, ప్రశాంత్, సూర్యవరప్రసాద్, హర్ష దేవ్‌దాస్, ఊషన్న, తదితరులు పాల్గొన్నారు.

### ■ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**ఉట్నూరు గ్రామీణం:** తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. ఆదిలాబాద్‌లో ప్రారంభమైన పాదయాత్ర గురువారం ఉట్నూరు చేరుకుంది. స్థానిక నాయకులు సీపతి లింగాగౌడ్, దావుల రమేష్, కొండేరి రమేష్, కాటం రమేష్, కందుకూరి రమేష్ వారికి స్వాగతం పలికారు.

### ■ అటవీ సంరక్షణపై అవగాహన

**మావల:** ధూలపల్లి అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఫారెస్టు బీట్ అధికారులు గురువారం మావల హరితవనాన్ని సందర్శించారు. ఎఫ్ఆర్ఓ గులాబ్‌సింగ్ వారికి అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. రాశివనం, గడ్డిజాతులు, అరుదైన వృక్షజాతులపై అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్ఓ స్వరూప, ఎఫ్‌బీఓ జ్యోత్స్న తదితరులున్నారు.

### ■ బాధ్యతల స్వీకరణ

**బోథ్:** బోథ్ మండల వ్యవసాయాధికారిగా లింగంపెల్లి రవితేజ బుధవారం నియామకమయ్యారు. గురువారం బోథ్‌లోని వ్యవసాయాధికారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

### ■ రైతుల సేవలో బ్యాంకులు

**బేల:** రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు వీలుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలో అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు బేల బ్రాంచి మేనేజర్ రాజేశ్వర్ అన్నారు. గురువారం మాంగ్రూడ్‌లో ఏర్పాటు చేసి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ ఆఫీసర్ రోహిత్ శర్మ, గ్రామస్థులు మంగేష్ ఠాక్రే, రైతులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### ■ మంచినీటి సహాయకులకు శిక్షణ

**భీంపూర్:** మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గురువారం భీంపూర్‌లోని రైతువేదికలో గ్రామ మంచి నీటి సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈఈ చంద్రమోహన్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఏఈ చంద్రశేఖర్, గ్రామాల నీటి సరఫరా సిబ్బంది పాల్గొన్నారు.

**బోథ్:** మనిషి మనుగడకు ఆహారంతో పాటు నీరు అవసరమేనని మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్ అన్నారు. బోథ్‌లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతువేదికలో నిర్వహిస్తున్న మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి వాజిద్ అలీ, డీఈ రమణ, మిషన్ భగీరథ ఏఈ కళ్యాణ్, గ్రిడ్ ఏఈ రమాకాంత్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ■ ఎన్‌హెచ్‌ఎం డీపీఎంగా వంశీకృష్ణ

**ఆదిలాబాద్ వైద్య విభాగం:** ఎన్‌హెచ్‌ఎం డీపీఎం(జిల్లా కార్యక్రమ మేనేజర్)గా బేల పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు.

### ■ పారిశుద్ధ్య లోపంపై అసహనం

**ఆదిలాబాద్ అర్బన్:** బల్దియా అధికారులు గురువారం పట్టణంలోని నటరాజ్, నటరాజ్ డీలక్స్ సినిమా థియేటర్లను తనిఖీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ మూత్రశాలలు, మరుగుదొడ్ల వద్ద పరిశుభ్రత పాటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది రవి, సాయి, అక్షయ్ తదితరులున్నారు.

### ■ రైతు సంక్షేమానికి పెద్దపీట

**బేల:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.10వేల చొప్పున జమ చేయడంతో ఆ పార్టీ నాయకులు గురువారం బెదోడలో రైతు పొలంలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విలాస్ పటేల్, నాయకులు పాల్గొన్నారు.

### ■ బేల ఏఓగా సాయితేజారెడ్డి

**బేల:** బేల మండల వ్యవసాయ అధికారి(ఏఓ)గా గోపిడి సాయితేజారెడ్డి నియమితులయ్యారు. జైనథ్ రైతు వేదిక భవనంలో ఏడీఏ అష్రఫ్‌కు నియామక పత్రం అందజేసి ఏఓగా బాధ్యతలు స్వీకరించారు.

### ■ వేతన బకాయిలు చెల్లించాలని వినతి

**బోథ్:** రాష్ట్రంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రధాన కేంద్రాలుగా మారిన నాలుగు వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు అయిదు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. బోథ్‌లో ఐసీడీఎస్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. జితేందర్, రేణుక, సునీత, కౌసల్య, కళావతి, విమల, నాగుబాయి, అనసూయ, పంతాబాయి, బబిత పాల్గొన్నారు.

### ■ బలమైన కార్మిక సంఘం నిర్మాణానికే విలీనం

**ఎదులాపురం:** అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి చేపట్టనున్న పోరాటాల కోసమే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం అవుతోందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమ్రె సచిన్, జగన్‌సింగ్ పేర్కొన్నారు. 20న హైదరాబాద్ సుందరయ్యభవన్‌లో నిర్వహించనున్న విలీన సభ గోడప్రతులను పిట్టలవాడలో ఆవిష్కరించారు. మనోజ్, రాజు, బుజ్జిరాం, రవి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

### ■ అనారోగ్యంతో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలి మృతి

**భీంపూర్:** కరంజి-టి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డి అనుంబాయి(59) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పొదుపు సంఘ సభ్యులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని కుటుంబీకులను పరామర్శించారు.


పూలతో కనువిందు చేస్తున్న యాపల్‌గూడ పాఠశాల


ఆకట్టుకుంటున్న బడి తోట


పాఠాలు వింటున్న విద్యార్థులు

# ప్రకృతి ఒడి.. చదువులమ్మ బడి

ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషితో పచ్చదనంతో కళకళలాడుతోంది. పచ్చని చెట్ల నీడ, చల్లటి గాలితో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. వివిధ రకాల పూలమొక్కలతో పాటు అలంకరణ మొక్కలు పెంచారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సంరక్షిస్తున్నారు. కిచెన్ గార్డెన్‌లోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు లభిస్తున్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీపై వివిధ అక్షరాలు, సామెతలు, మహనీయుల చిత్రాలను గీయించి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేలా తయారు చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిశుభ్రమైన వాతావరణంలో వంటగది ఉంది. రూ.లక్ష ఖర్చుతో వెయ్యి పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఈ బడికి స్వచ్ఛ విద్యాలయం పురస్కారం లభించింది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగన్న, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల సభ్యుల అంకితభావం తోడు కావడంతో ప్రైవేటు పాఠశాలకు దీటుగా చదువు, వసతులతో ఆదర్శంగా నిలుస్తోంది. ఒకప్పుడు 120 మంది విద్యార్థులు ఉండగా.. ఉపాధ్యాయుల కృషితో ప్రస్తుతం 310 మందితో ఆంగ్ల మాధ్యమంలో కొనసాగుతోంది. జైనథ్ నుంచి కూడా ఈ పాఠశాలకు చదువుకోవడానికి విద్యార్థులు వస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



# సొరకాయ @ 4 అడుగులు

సొరకాయ సాధారణంగా ఒక అడుగు లేదా రెండు అడుగుల పొడవు ఉంటుంది. కుమురం భీం జిల్లా కెరమెరికి చెందిన రైతు వాగ్మారే లక్ష్మణ్ పంట చేనులో నాలుగు అడుగుల పొడవైన సొరకాయ కాసింది. కాయను సదరు రైతు ఇంటికి తీసుకెళ్తుండగా.. స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

న్యూస్‌టుడే, కెరమెరి (భీంపూర్)



# అడుగులు తడబడి.. ఆగిన ఊపిరి

- నీటి బకెట్‌లో పడి పది నెలల బాలుడి దుర్మరణం



**వాంకిడి, న్యూస్‌టుడే:** ఇప్పుడిప్పుడే బుడిబుడి అడుగులు వేస్తున్న కుమారుడిని చూసి మురిసిపోతున్న తల్లిదండ్రులకు.. అవే అడుగులు తీవ్ర గుండెకోతను మిగిల్చాయి. వంశాంకురం పుట్టాడని అల్లారుముద్దుగా పెంచుకుంటున్న అంతలోనే విగతజీవిగా మారేసరికి తల్లడిల్లిపోయారు. పది నెలల వయసులోనే నూరేళ్లు నిండిన కుమారుడి మరణం ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది. వాంకిడి మండలంలో ఓ చిన్నారి ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడి మృత్యువాత పడ్డ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. . తేజాపూర్ గ్రామానికి చెందిన చౌదరి గిర్మాజీ-సునీత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు తన్వీర్ (పది నెలల వయసు) ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గిర్మాజీ వ్యవసాయ పనులకు వెళ్లగా సునీత ఇంటి పనుల్లో నిమగ్నమైంది. ఈ క్రమంలో తన్వీర్ ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడిపోయాడు. కుమారుడు కనిపించకపోయేసరికి తల్లి ఇంటి ఆవరణలో వెతకగా బాత్‌రూంలోని బకెట్‌లో విగతజీవిగా కనిపించాడు. వెంటనే ఆసిఫాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. నీటిలో ఊపిరాడక మృతి చెంది ఉంటాడని వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పోశెట్టి తెలిపారు.

# మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం పంపిణీ

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో పేదలకు లబ్ధి



కోటపల్లి మండలం రాపన్‌పల్లిలో చౌకధరల దుకాణంలో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

**చెన్నూరు గ్రామీణం, ఏసీసీ, న్యూస్‌టుడే :** కొవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురైన పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. 2021 నుంచి మూడు నెలలకోసారి పథకాన్ని పొడిగిస్తూ వస్తున్న కేంద్రం.. 2023 డిసెంబరులో ఒకేసారి ఏడాది పాటు ఉచిత బియ్యం అందించనున్నట్లు ప్రకటించింది. ఈ గడువు డిసెంబరులో ముగియనుండటంతో ఇటీవల భేటీ అయిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్రం ఈ నెల 9న ఆమోదం తెలపడంతో లక్షలాది మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,60,627 ఆహార భద్రతకార్డులు ఉండగా.. 23,93,693 మంది లబ్ధిదారులు ఉన్నారు. కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడు నెలకు అయిదుకిలోల చొప్పున ఉచితంగా బియ్యాన్ని పొందుతున్నాడు. ప్రభుత్వం ప్రతినెల సుమారు 19,709.60 క్వింటాళ్ల బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది.

## ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

ఆహార భద్రత కార్డుదారులకు కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం పంపిణీ చేసేందుకు నిర్ణయించిన బియ్యం సైతం పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో పేదలకు బలవర్ధకమైన బియ్యం పంపిణీ మరో నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలు ఉంటాయి.




## ఎలాంటి ఉత్తర్వులు అందలేదు

ఉచిత బియ్యం పంపిణీని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. బియ్యం పంపిణీలో ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- బ్రహ్మారావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మంచిర్యాల

# చిగురిస్తున్న ఆశలు



- రాయితీపై వ్యవసాయ సామగ్రి అందజేయనున్న సర్కారు

**దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** సేద్యం చేయడానికి గతలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. దున్నడం మొదలు పంట నూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నారు.

- వ్యవసాయశాఖపరంగా ఇప్పటికే రైతు బంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు.

**ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)**

| జిల్లా | రైతులు (లక్షల్లో) | వరిసాగు విస్తీర్ణం | పత్తి సాగు |
|---|---|---|---|
| మంచిర్యాల | 1.45 | 1,80,567 | 1,21,704 |
| ఆదిలాబాద్ | 1.22 | 1,984 | 3,87,213 |
| నిర్మల్ | 1.54 | 95,824 | 1,37,390 |
| కుమురం భీం | 0.97 | 58,904 | 2,98,779 |

## యంత్రాలివే..

రాయితీపై అందించే యంత్రాల్లో రోటావేటర్లు, కల్టివేటర్, దమ్ముచక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు రాయితీపై అందనున్నాయి.

## తప్పనున్న కొనుగోలు 'భారం'

బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచారలోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదైమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.

# నీటి పారుదల శాఖకు కొత్తగా 52 మంది ఏఈఈలు

**ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) పోస్టులు భర్తీ అయ్యాయి. ఉమ్మడి జిల్లాకు 52 మందిని కేటాయించగా, ఆదిలాబాద్ జిల్లాకు 8, నిర్మల్‌కు 16 మంది, మంచిర్యాలలో 12, కుమురం భీం జిల్లాకు 16 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన ఏఈఈలను జిల్లాల వారీగా కేటాయించడంతో పాటు ఆయా సబ్‌డివిజన్ కార్యాలయాల్లో విధుల్లో చేరాలని ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల వారీగా కొత్తగా ఏఈఈలు రావడంతో నీటి పారుదల శాఖ పరిధిలో పనులు మరింత వేగవంతం అయ్యే అవకాశం ఉంది.


చెట్టు కింద పడి ఉన్న గొర్రెలు, మేకల కళేబరాలు

# పిడుగుపాటుతో గొర్రెలు, మేకలు మృతి

**సారంగాపూర్, న్యూస్‌టుడే :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం రాసింగ్‌తండా సమీపంలో గురువారం సాయంత్రం పిడుగుపడి గొర్రెలు, మేకలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చవాన్ ఇనేష్ అనే రైతు తన గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లాడు. భారీ వర్షం కురవడంతో జీవాలను ఓ చెట్టు కిందకు చేర్చాడు. అదే సమయంలో పిడుగు చెట్టుపై పడటంతో అక్కడ ఉన్న 60 గొర్రెలు, 5 మేకలు మృతి చెందాయి. స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

# అమ్మాయిలు.. పతక విజేతలు

- జాతీయస్థాయి కబడ్డీలో రాణింపు

**న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం :**

**ఒకవైపు పేదరికం.. మరోవైపు క్రీడలంటే ఇష్టం.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆ బాలికలు రాష్ట్ర, సొసైటీ క్రీడలు, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు.. పతకాలు సాధిస్తున్నారు.. ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు.. ఆల్‌రౌండర్లుగా గుర్తింపు తెచ్చుకుంటున్న వీరంతా జట్టు గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్నారు.. క్రీడా విభాగంలో ప్రభుత్వ కొలువులు సాధించడమే తమ లక్ష్యమని చెబుతున్నారు.**


కబడ్డీ ఆటలో తలపడుతున్న బాలికలు

## క్రీడాకారిణిగా గుర్తింపు పొందాలని.

- సిడాం తుక్కరాణి



మాది ఆదిలాబాద్. ఇంద్రవెల్లిలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ఎనిమిదో తరగతి నుంచి కబడ్డీ ఆడుతున్నా. ఇప్పటి వరకు రెండుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. ఉత్తమ డిఫెండర్‌గా, రైడర్‌గా పురస్కారం అందుకున్నా. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పసిడి పతకం సాధించాలని, క్రీడా కోటాలో పోలీసు ఉద్యోగం పొందాలన్నదే ధ్యేయంగా పెట్టుకున్నా.

## ప్రో-కబడ్డీలో ఆడాలని..: ఆర్.అనూషా



మాది తలమడుగు మండలం సుంకిడి గ్రామం. అక్కడే జడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. సూర్యాపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. పీడీ నాందేవ్ శిక్షణలో మంచి రైడర్‌గా ప్రావీణ్యం పొందా. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలని, ప్రో-కబడ్డీ పోటీల్లో ఆడాలని ఉంది. పాఠశాల సెలవు అనంతరం రోజూ రెండు గంటలు సాధన చేస్తున్నా.

## సైన్యంలో చేరాలని..: టేకం అంజలి



మాది రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామం. ఇచ్చోడలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీలో పదో తరగతి చదువుతున్నా. మూడేళ్లుగా కబడ్డీ ఆట ఆడుతున్నా. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. సైన్యంలో చేరాలన్న తన చిన్నప్పటి కలను సాకారం చేసేందుకు కబడ్డీ కోర్టులో తీవ్రంగా శ్రమిస్తున్నా. ఆ ఆటలోని మరిన్ని మెలకువలు నేర్చుకుంటున్నా.

## పోలీసు కావాలని..

- బి.సోనాలి



మాది ఇంద్రవెల్లి. ఆదిలాబాద్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో పదో తరగతి చదువుతున్నా. నిజామాబాద్, గజ్వేల్, సూర్యాపేట, హనుమకొండ, మంచిర్యాల ప్రాంతాల్లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నా. బిహార్, రాజస్థాన్, ఝార్ఖండ్ వేదికల్లో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించా. ఒకసారి ఉత్తమ రైడర్‌గా ఎంపికయ్యా. క్రీడా విభాగంలో పోలీసు కావాలనే లక్ష్యంతో తీవ్రంగా సాధన చేస్తున్నా.

# బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి బాధ్యతల స్వీకరణ


ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్‌ను సన్మానిస్తున్న మాజీ ఉపకులపతి వెంకటరమణ

**ముథోల్(బాసర), న్యూస్‌టుడే:** బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా గోవర్ధన్ గురువారం హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇది వరకు ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పనిచేసిన వెంకటరమణ, పరిపాలన విభాగం అధికారి రణధీర్‌లు స్వాగతం పలికారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చి పరిశీలిస్తానన్నారు.



# ప్రమాదాల దారి.. పర్యవేక్షణ ఏది?

- ప్రజాప్రతినిధులు స్పందిస్తేనే మేలు

**ఈటీవీ - ఆదిలాబాద్ :** నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) విభాగం నిర్లక్ష్యంతో ఆదిలాబాద్ - నిర్మల్ మధ్య ఉన్న 44వ నెంబరు జాతీయ రహదారి రక్తమోడుతోంది. నిర్మల్ కేంద్రంగా ఉండే ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ) కార్యాలయం కరోనా సమయంలో కామారెడ్డికి మారింది. అప్పటి నుంచి నిర్మల్ జిల్లా సోన్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం డొల్లార వరకున్న 115 కి.మీ. రహదారి నిర్వహణపై ఆ శాఖ పర్యవేక్షణ లేకుండాపోయింది.

- తాజాగా ఈ నెల 6న జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రహదారిపైనే లారీని నిలిపారు. పొగమంచు కారణంగా లారీని పసిగట్టలేక ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆదిలాబాద్ శాంతినగర్ విద్యార్థి హర్షవర్ధన్ మృతి చెందటం విషాదానికి దారితీసింది.

రోడ్డుపై వాహనాలు నిలపరాదు. ఎన్‌హెచ్ అనుమతి లేకుండా రహదారిని ఆనుకొని దాబాలు నిర్వహించరాదు. అనుమతి ఉంటే రోడ్డుకు ఆనుకొని 10 మీటర్ల స్థలం వదిలేసి ప్రవేశం(ఎంట్రీ), నిష్క్రమణ(ఎగ్జిట్) మార్గాలుండాలనే నిబంధనలు అమలుకాక ప్రమాదాలకు దారితీస్తోంది.




నిర్మల్ జిల్లా గంజాల్, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ, జైనథ్ మండలం పిప్పర్‌వాడ దగ్గర ఏర్పాటుచేసిన టోల్‌ప్లాజాలు ద్వారా ఎన్‌హెచ్ విభాగం డబ్బులు వసూలు చేయటానికి అనుమతిచ్చిందే తప్పితే ప్రమాదాలకు కారణాలపై దృష్టి పెట్టడం లేదు. నిర్మల్, ఖానాపూర్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల పరిధిలోని మూడు టోల్ ప్లాజాల ద్వారా సగటున రోజుకు 10 వేల వాహనాల రాకపోకలు జరుగుతాయనేది అంచనా. ఒక్కో ప్లాజాకు రూ.40 లక్షల చొప్పున మూడింటి ద్వారా రూ.1.20 కోట్లు వాహనదారులు చెల్లించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం టోల్ వసూళ్లకు అనుమతిస్తున్న అధికారులు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టడం లేదు. ప్రజాప్రతినిధులు ప్రశ్నించకపోవటం రహదారి నిర్వహణను చూసే గుత్తేదారులకు కలిసొస్తోంది.

## గాల్లో కలుస్తున్న ప్రాణాలు

నేరడిగొండ టోల్ ప్లాజా దగ్గర రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉన్న దృశ్యమిది. గంజాల్, పిప్పర్‌వాడ సహా రోడ్డును ఆనుకొని ఉన్న ప్రతి దాబా దగ్గర ఇదే పరిస్థితి. కొన్ని దాబాల్లోనైతే మద్యం తాగి, భోజనాలు చేస్తున్నా ఎన్‌హెచ్, పోలీసు, ఆబ్కారీ శాఖాధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఈ ఏడాది జనవరి 8న మావల బైపాస్ దగ్గర అపసవ్య దిశలో వచ్చిన కంటైనర్ ఢీకొనడంతో ఆదిలాబాద్‌కు చెందిన అఖిలేష్(29) మృతి చెందారు.



## చేయాల్సిందేమిటి?

- ఎన్‌హెచ్, రెవెన్యూ, పోలీసు, రవాణా, ఆబ్కారీ అధికారులతో సంయుక్త సమావేశాలు నిర్వహించి ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను అన్వేషించాలి.
- కామారెడ్డి ఎన్‌హెచ్ పీడీకి అనుబంధంగా ఆదిలాబాద్, నిర్మల్ కేంద్రాలుగా డివిజన్ కార్యాలయాలు ఏర్పాటుచేయాలి.
- దాబాల్లో మద్యం, గంజాయి వినియోగాన్ని అరికట్టాలి.
- 25 కి.మీ.లకు ఒక అంబులెన్సును అందుబాటులో ఉంచాలి.
- 2012లో చేసిన సర్వేలో గుర్తించిన 53 ప్రమాద పాయింట్లలో ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది వెల్లడించాలి.
- గుడిహత్నూర్-జందాపూర్, గిమ్మ బైపాస్ దగ్గర వంతెనలు సహా రెండు వైపులా సర్వీసు రోడ్లు అందుబాటులోకి తేవాలి.

☛ గత నెల 30న అర్ధరాత్రి గుడిహత్నూర్ మండలం మేకలగండి దగ్గర జరిగిన ప్రమాదంలో మహ్మద్ ఉస్మాన్ ఉద్దీన్, సయ్యద్ మహ్మద్ అలీ, సయ్యద్ మొహిజొద్దీన్, మొహినొద్దీన్, మహ్మద్ ఫరీద్ ఉద్దీన్ మృతి చెందారు. వీరంతా ఆదిలాబాద్ టీచర్స్ కాలనీలోని ఒకే కుటుంబానికి చెందినవారు.

# ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

**నస్పూర్, న్యూస్‌టుడే :** శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 విభాగంలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ఫౌండర్ రమేష్, క్రీడా సమాఖ్య కార్యదర్శులు ఫణిరాజా, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన క్రైస్తవులు

# అందరూ దైవ సమానులే: మంత్రి సీతక్క


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వినోద్

**కాసిపేట, న్యూస్‌టుడే:** కులమతాల మధ్య భేదాలు సృష్టించుకోవద్దని, అందరూ దైవ సమానులే అని మంత్రి సీతక్క అన్నారు. బెల్లంపల్లి మండలం సోమగూడెంలోని కల్వరి చర్చి పాస్టర్ ప్రవీణ్ 50 రోజుల ఉపవాస దీక్ష ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రైస్తవుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దాదాపు లక్ష పైచిలుకు క్రైస్తవ భక్తులతో సభ ప్రాంగణం నిండిపోయింది. ప్రపంచ శాంతి కోసం ఏటా 50 రోజుల పాటు ఉపవాస దీక్షలను చేపడుతున్నట్లు పాస్టర్ ప్రవీణ్ చెప్పారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ఈ ఉపవాస దీక్షతో తమ ప్రాంతం దేశం మొత్తం తెలిసిందన్నారు. ప్రపంచ స్థాయిలో కల్వరి ఇంతలా పేరు సాధించడం సంతోషకారణమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, మున్సిపల్ ఛైర్మన్ శ్వేత, రవికుమార్, నాతరి స్వామి, రాంచందర్ తదితరులున్నారు.